# నిశ్శబ్దనాదం



మధుబాబు

# నిశ్శబ్దనాదం

## మధుబాబు

మధుప్రియ పబ్లికేషన్స్
మాచవరం • విజయవాడ - 520 004

# NISSABDANADAM

(Serialised in 'Navya' weekly)

By

**MADHUBAABU**

Published by:
**MADHU PRIYA PUBLICATIONS**
Machavaram, Vijayawada - 520 004
Phone : 0866 - 2431969

First Edition :
**2014**

Price :
**Rs. 125-00**

Cover Design :
**DURGA RAO**

Printers :
**SRI CHAITANYA OFFSET PRINTERS**
Vijayawada-2

# నిశ్శబ్దనాదం

చిక్కటి నీడ ఒకటి ముఖం మీద పడుతున్న ఫీలింగ్ కలిగేసరికి చటుక్కున కళ్ళు తెరిచాడు శ్యామ్‌సుందర్. వెంటనే కనిపించింది అతనికి యాభై అడుగుల ఎత్తున గాలిలో చక్కర్లు కొడుతున్న రాబందు ఒకటి.

ఒక్కక్షణం... ఒకే ఒక్కక్షణం పాటు విపరీతమైన కలవరపాటుకు గురై, వెంటనే తమాయించుకున్నాడు అతను.

కళ్ళు తెరిచిన వెంటనే గుర్తుకు రాకపోయినా, భూతం మాదిరి తలని క్రిందికి వంచి తనవంకే చూస్తున్న ఆ రాబందును గమనించగానే టకటకా జ్ఞాపకం వచ్చేశాయి జరిగినవన్నీ.

జయ్‌సల్మీర్ సిటీలో అడుగుపెట్టిన వెంటనే ఎడారి మధ్యలో వున్న బండరాళ్ళ గుట్టల దగ్గరికి బయలుదేరాడు తను.

గూగుల్ మేప్స్‌లో చూస్తే, అరంగుళం వెడల్పు కూడా వుండనట్లు కనిపించే థార్ ఎడారి. యదార్థానికి దగ్గర దగ్గరగా ఎనభై వేల చదరపు మైళ్ళ విస్తీర్ణాన్ని కలిగి వుంటుంది.

ఎడారి సరిహద్దుల్లో తప్ప ఇంకెక్కడా కనిపించదు జన సంచారం. దాహం వేస్తే గొంతు తడుపుకోవడానికి నీళ్ళు కూడా సరిగ్గా లభించవు.

"నాది సాబ్ బాధ్యత... మిమ్మల్ని క్షేమంగా తీసుకుపోయి, క్షేమంగా సిటీకి తీసుకువస్తాను. తినటానికి తాగటానికి కావల్సినవన్నీ నా దగ్గర ఎవైలబుల్... ఫికర్ మత్‌కరో సాబ్..." తనకు తెలిసిన భాషలన్నిటినీ ఉపయోగిస్తూ చెప్పాడు అప్పుడు బేలూ భాయ్.

జయ్‌సల్మీర్ స్టేషన్లో టాక్సీ నడుపుతూ వుంటాడతను. స్టేషన్లో నుంచి బయటికి వచ్చీరాగానే శ్యామ్‌సుందర్ దారికి అడ్డుగా నిలబడి తన కహానీనంతా గడగడా వినిపించేశాడు.

టూరిస్ట్ ట్రాఫిక్ మీద ఆధారపడి జీవించే వాళ్ళ వాగ్ధాటి ఎలా వుంటుందో తెలుసుకాబట్టి – పెద్దగా సంశయించలేదు శ్యామ్ సుందర్. రెండో ఆలోచన చేయకుండా, అతని టాక్సీలో కూర్చున్నాడు.

ఓటి డబ్బాలో గులకరాళ్ళు వేసి మ్రోగించినట్లు వికృత శబ్దాలు చేస్తూ బయలుదేరింది అది. పదే పది నిమిషాల్లో సిటీ లిమిట్స్‌ని దాటింది. ఇరవై రెండో నిముషంలో, అందరూ ప్రయాణం చేసే మెయిన్ రోడ్డును వదిలి ఎగుడు దిగుడుగా వున్న ఇసుక మార్గంలోకి ఎంటర్ అయింది.

పాంటుజేబులో నుంచి పొడవాటి కాయితాన్ని బయటికితీసి, దాని మీద ప్రింట్ చేసి వున్న గీతల్ని క్లోజ్‌గా చూశాడు శ్యామ్‌సుందర్.

జయ్‌సల్మీర్ సిటీకి ముప్ఫయ్ కిలోమీటర్ల దూరంలో వుంటాయి తను చేరుకోవలసిన బండరాళ్ళు. అందరూ ఉపయోగించే మెయిన్ రోడ్డును వదిలి ప్రక్కకు మళ్ళాల్సిన అవసరమే లేదు.

"మనం తప్పుదారిలోకి మళ్ళినట్టున్నాము... కరెక్టు చేసుకుంటే బాగుంటుందేమో చూడు..." కాయితం మీది నించి చూపుల్ని బేలూ భాయ్ మీదికి మళ్ళిస్తూ నెమ్మదిగా చెప్పాడు.

"తెలుసు సాబ్... నాకు పూర్తిగా తెలుసు... ఇది చాలా దగ్గర దారి సాబ్... ఇంకో అరగంటలో వెళ్ళిపోతాం అక్కడికి" తలను వెనక్కి తిప్పి అతని వంక చూడకుండానే చాలా కాన్ఫిడెంట్‌గా సమాధానం ఇచ్చాడు బేలూభాయ్.

బయటికి తీసిన కాయితాన్ని తిరిగి మడతలు పెట్టి పాంటుజేబులోకి నెట్టుకొంటూ తల ఊపాడు శ్యామ్‌సుందర్.

సరిగ్గా అప్పుడే ఒక చిన్న డిప్రెషన్‌లో పడి, పెద్ద జర్క్ ఒకటి ఇచ్చింది టాక్సీ... దబదబమంటూ వికృత శబ్దం చేసి, చటుక్కున ఆగిపోయింది ఇంజన్.

"ఏమిటదీ? ఏమయింది?' ఆశ్చర్యంగా అడిగాడు శ్యామ్‌సుందర్.

"ఇసుక సార్... ఈ ఇసుక ఎప్పుడు పుట్టిందో ఎలా పుట్టిందో తెలియదుగాని, మమ్మల్ని చావకొట్టి చెవులు మూస్తోంది... ఎక్కడ గట్టిగా వుంటుందో, ఎక్కడ మెత్తగా వుంటుందో తెలియదు... బండి దిగబడిపోయింది" అంటూ డోర్ తెరుచుకుని క్రిందికి దిగాడు బేలూభాయ్...

ముందు టైర్ల దగ్గర నిలబడి తదేకంగా చూశాడు వాటివంక. "ఒక్కసారి కిందికి దిగుతారా సాబ్? శ్రమ అనుకోకుండా ఒక్కసారి గట్టిగా ఒక పట్టుపడతారా?" వెనుక డోర్‌ని తెరిచి పట్టుకుంటూ బహు మర్యాదగా అడిగాడు.

అప్పుడు కూడా ఏమంత సీరియస్‌గా ఆలోచించలేదు శ్యామ్ సుందర్. ఎడారిలో ప్రయాణం అంటే మాటలు కాదు. ఎప్పుడు ఏ క్షణంలో ఎటువంటి ఇబ్బంది ఎదురవుతుందో ఎవరికీ తెలియదు. ఇరిటేట్ అయితే ఎనర్జీవేస్ట్ అవటమే తప్ప ఎటువంటి ఉపయోగం వుండదు.

ప్రక్కకు జరిగి పాదాల్ని బయటపెట్టాడు టాక్సీలో నుంచి. బేలూ భాయ్ తెరిచి పట్టుకున్న డోర్ అంచుమీద చెయ్యివేసి క్రిందికి దిగటానికి కొద్దిగా ముందుకు వంగాడు.

అప్పుడు కూడా రాలేదు అతనికి అనుమానం... టాక్సీలో నుంచి పూర్తిగా బయటికి వచ్చిన వెంటనే వచ్చింది.

ఊపిరి బిగపట్టి ఒక్క గంతులో రెండు అడుగుల దూరం అవతలికి దూకాలని అనుకున్నాడు. అనుకోవటం వరకే... అలా దూకక ముందే బలమైన ఇనుపరాడ్ ఒకటి ప్రత్యక్షమైంది బేలూభాయ్ చేతిలో. వేగంగా పైకి లేచి తప్పున పడింది అతని తల పైభాగంలో.

కళ్ళ ముందు రకరకాల రంగులు ప్రత్యక్షం అవుతూ వుండగా, ముందుకు తూలి బోర్లాపడిపోయాడు శ్యామ్‌సుందర్ ఇసుకలో.

అనవసరమైన శబ్దం ఒక్కటి కూడా రాలేదు బేలూభాయ్ నోటినుంచి. పెదవులు బిగపట్టి. దభీదభీమని కొట్టాడు అతను మరో నాలుగు దెబ్బలు.

భరించటం అసాధ్యమై బాధగా అరిచాడు శ్యామ్‌సుందర్. వేగంగా పక్కకు దొర్లి, చేతులతో తలను కప్పుకున్నాడు.

అప్పటికే ఆలస్యం అయిపోయింది. మొట్టమొదటి దెబ్బనయితే తట్టుకోగలిగింది గాని, ఆ తర్వాత పడిన దెబల్ని భరించలేక పోయింది అతని శిరస్సు. మూడు అంగుళాల పొడవున సన్నగా చిట్లింది. ఎర్రటి రక్తం వెంటనే వెలుపలికి వచ్చి, అతని మొఖాన్ని తడిపి ముద్ద చేయటమే కాకుండా క్రింద ఇసుక మీదికి కూడా జారటం మొదలుపెట్టింది.

కదలకుండా కళ్ళు తేల వేసినట్లు వుండిపోతే తప్ప బేలూభాయ్ దెబ్బల్ని డెలివర్ చేయటాన్ని ఆపడని అర్థమైపోయింది శ్యామ్ సుందర్‌కి. అయితే అలా నటించవలసిన అవసరం లేకుండానే, తప్పిపోయింది అతనికి స్పృహ. పక్కకు వాలిపోయింది తల.

తిరిగి ఇప్పుడు మొఖం మీద రాబందు నీడ పడటంతో వచ్చింది తెలివి. బరువైన ఇనుప సమ్మెటతో బాదుతున్నట్లు పోటెత్తి పోతున్న తలను ఎంతో ప్రయత్నం మీద చేతుల్ని ఎత్తి తడుముకున్నాడు అతను.

మరోసారి ఇంకో దెబ్బ పడినంత బాధ – జివ్వుమనిపించింది అతని నరాల్ని పళ్ళు బిగపట్టి ఆ బాధను భరిస్తూ అతి నెమ్మదిగా లేచి కూర్చున్నాడు.

రక్తం విపరీతంగా కారి పోవటం వల్ల నశించిపోయింది స్టామినా... ఆ కాస్త కదలికలకే చుట్టూ వున్న ప్రపంచమంతా గిర్రున తిరుగుతున్న సెన్సేషన్ కలిగింది.

తెరిచిన కళ్ళను తిరిగి గట్టిగా మూసుకుని కదలకుండా పడుకోవటమే బెస్టన్నమాట మనసులో మెదిలి చీమలు పాకినట్లు జలదరించింది అతని శరీరం.

ఎడారిలో వున్నాడు తను... అందరూ ప్రయాణం చేసే మెయిన్ మార్గానికి దూరంగా ఇసుక దిబ్బల మధ్యన పడి వున్నాడు.

ఎవరో వచ్చి ఏదో ఒక సాయం చేస్తారని ఆశించటం అవుటాఫ్ క్వశ్చన్. అలాగని అక్కడ ఆగటం కూడా ఆరోగ్యానికి మంచిదికాదు...

సూర్యుడు నడినెత్తిమీదికి వస్తున్న కొద్దీ అధికం అయిపోతుంది ఉష్ణోగ్రత... సెగలు పొగలు వెలువడతాయి ఇసుకలో నుంచి. శీరరంలోని నీరంతా

ఆవిరైపోతుంది.... దాహంతో నాలుక పిడచ గట్టుకుపోయి, డీ హైడ్రేషన్ వచ్చి ఆ పైన కొద్దిగా కూడా ముందుకు సాగలేదు శ్యామ్‌సుందర్ ఆలోచనలు...

అల్‌రెడీ వచ్చేసింది ఒక రాబందు... ఇంకో నిముషంలోనో, రెండు నిమిషాల్లోనే దాని స్నేహితులు, బంధువులు, చుట్టాలు పక్కాలు అన్నీ వచ్చేస్తాయి. ఓపిక నశించి మాగన్నుగా పడిపోయిన వెంటనే తనను సజీవంగానే ఆరగించి ఆనందిస్తాయి.

శరీరంలో మిగిలి వున్న ఓపికనంతా కూడగట్టుకుంటూ నెమ్మదిగా లేచి నిలబడ్డాడతను. ఫుల్‌గా డ్రింక్ చేసినట్లు తూలుకుంటూ పది అడుగులు ముందుకు వేశాడు.

పదకొండో అడుగు ముందుకు పడకముందే, మరోసారి గిర్రున తిరిగాయి కళ్ళు. నిలుచున్న వాడు నిలుచున్న విధంగానే విరుచుకు పడిపోబోతూ వుండగా– అతని చెవులకు చేరిందా అరుపు.

మెదడును ఆవరించుకుని అతన్ని క్రిందికి పడద్రోయబోతున్న మైకం.... కొంచం... చాలా కొంచెంగా వెనక్కి తగ్గింది.

తన ప్రమేయం లేకుండానే పడిపోయిన అతను, తనంతట తనే నెమ్మదిగా ఇసుకలో కూర్చుండిపోయాడు...

జయ్‌సల్మీర్‌ని బేస్‌గా చేసుకుని ఆ చుట్టుపట్లవుండే చారిత్రిక ప్రదేశాలను చూడటానికి వచ్చే యాత్రికులు తప్ప, వేరే వారెవరూ సంచరించని ప్రదేశంలో వున్నాడు తను.

ఈ యాత్రీకులు కూడా వేగంగా నడిచే వెహికల్స్‌లో మెయిన్‌రోడ్డు మీద ప్రయాణం చేస్తూ వుంటారే తప్ప, ఈ దుర్మార్గపు ఇసుక దిబ్బల మధ్యకి రారు...

మరి తనకు వినిపించిన అరుపు ఎవరిదై వుంటుంది?

ఊపిరి బిగపట్టి చెవులు రిక్కించాడు శ్యామ్‌సుందర్. చీమ చిటుక్కు మన్నా చాలాపెద్దగా వినిపించేటంత నిశ్శబ్దంతో నిండి వున్నాయి పరిసరాలు.

తలకు తగిలిన దెబ్బ మూలకంగా తను భ్రమపడటం జరుగుతోందని తెలిసిపోయింది అతనికి... రెండు నిముషాలు గడిచిన తర్వాత కూడా ఎటువంటి శబ్దము వినిపించకపోయేసరికి.

బిగపట్టిన ఊపిరిని బరువుగా బయటికి వదులుతూ, మరోసారి ఓపికనంతా కూడ గట్టుకుని లేచి నిలుచున్నాడు అతను. అడుగు ముందుకు వేయబోతుండగా... మళ్ళీ ఇంకోసారి వినిపించింది అంతకు ముందు వినవచ్చిన చప్పుడు.

విపరీతమైన భయంతో వణికిపోతూ ఎవరో చిన్నపిల్లలు...“అమ్మా...” అని బుగిలిపోతున్నారు.

ఎక్కడినించి వచ్చిందో శ్యామ్‌సుందర్‌కి తెలియకుండానే వచ్చేసింది విపరీతమైన శక్తి. తనకు తెలియకుండానే ప్రక్కకు తిరిగి, ఆ అరుపు వినబడిన వైపుకు వేగంగా కదిలాడు.

రెండు నిలువుల ఎత్తున మూడు ఇసుకగుట్టల మధ్యన లేచి నిలబడేందుకు అవసరమైన ఓపిక లేకపోవడం వల్ల ఇసుకలోనే వెల్లకిలాపడి కనిపించింది అతనికి. ఐదారురోజుల కంటే ఎక్కువ వయస్సు వుండని ఒక మేకపిల్ల.

బేలూభాయ్ కొట్టిన దెబ్బలకు అల్లకల్లోలమైపోయిన అతని శబ్ద గ్రహణ శక్తికి చిన్నపిల్లలు తల్లిని పిలుస్తున్నట్టుగా వినిపించింది దాని అరుపు.

అంతకుముందు తెలివివచ్చిన వెంటనే అతనికి కనపించిన రాబందు నిజానికి అతని కోసం రాలేదు. అదేపనిగా అలమటించిపోతున్న ఆ చిన్న ప్రాణం కోసమే వచ్చింది.

అది ఒక్కటే కాదు. దాని కదలికలను కనిపెట్టి ఇంకా కొన్ని పక్షులు కూడా వచ్చేస్తున్నాయి అక్కడికి.

మేకపిల్ల పడివున్న ప్రదేశానికి పది అడుగుల దూరంలో నేలకు దిగి అరిచే ఓపికకూడా హరించిపోయిన తర్వాత దాని మీదికి దుమికేందుకు సిద్ధం అవుతున్నాయి.

చేతుల్ని గాలిలో ఊపుతూ పెద్దగా అరిచాడు శ్యామ్‌సుందర్. అరిచానని అనుకున్నాడు అతను. పెదవులయితే కదిలాయి గాని, శబ్దం మాత్రం బయటికి రాలేదు.

నిస్సహాయంగా పడి వున్న ఆ చిన్నప్రాణానికి, తనకు ఏమంత పెద్ద డిఫరెన్స్ లేదని వెంటనే అనిపించింది అతనికి. ఏదో ఒకటిచేసి వెంటనే తను శక్తిని పుంజుకోవటమో, సురక్షిత ప్రదేశానికి చేరుకోవటమో చేయకపోతే, ఆ మేకపిల్ల మాదిరిగానే ఆ ఇసుక దిబ్బలమధ్య అలమటించాల్సి వస్తుందని తెలిసిపోయింది.

అనుకోని విధంగా ప్రత్యక్షం అయిన అతన్ని చూసేసరికి, అమితమైన సంతోషం కలిగింది కాబోలు. తన చిన్నతోకను గబగబా ఊపుతూ మరింత బిగ్గరగా అరిచింది ఆ మేకపిల్ల... గబుక్కున లేచి నిలబడబోయి – ఓపిక చాలక మళ్ళీ క్రిందికి పడిపోయింది.

రెండు గంతులు వేసింది. ఇక ఇసుక దిబ్బమీద వాలిన రాబందు... తలను పాము మాదిరి ముందుకు జాచి, దీక్షగా చూసింది దానివంక.

చెవులు చిల్లులు పడేటట్లు బిగ్గరిగా అరిచి, క్షుద్రప్రాణిని దూరంగా తరమటం తనకు చేతకాని పని అని అంతకుముందే తెలిసి రావటం వల్ల, ఇంకోసారి అటువంటి ప్రయత్నం చేయలేదు శ్యామ్‌సుందర్.

సాధ్యమైనంత వేగంగా ముందుకుపోయి, లేచి నిలబడటానికి విఫల ప్రయత్నం చేస్తున్న ఆ చిన్ని ప్రాణం దగ్గర చతికిల బడ్డాడు.

"నీకు నాకు పెద్ద తేడా ఏమీ లేదు బేబీ. మనిద్దరి పరిస్థితి ఒక మాదిరిగానే వున్నది." దాని తలను ఒడిలోకి తీసుకుంటూ చెప్పాడు.

అతని మొఖంలోకే చూస్తూ మళ్ళీ శబ్దం చేసిందా మేకపిల్ల – ఆర్తిగా.

"యస్ బేబీ... వేడి ఎక్కువ అవుతోంది. మంచి నీడ కావాలి మన ఇద్దరికీ. మంచి నీళ్ళు కూడా కావాలి. గొంతులు తడుపు కోవటానికి...." చెపుతూ చుట్టూ చూశాడు అతను.

ఇసుక... ఎటుచూసినా ఇసుకే... నీడను ఇచ్చేందుకు చిన్నపాటి బండరాయి కూడా ఎక్కడా కనిపించడంలేదు.

తను మేకపిల్ల దగ్గరికి రావటాన్ని చూసిన తర్వాత, రాబందులు తమ దారిన తాము వెళ్ళిపోతాయని అనుకున్నాడు అతను. కాని ఒక్క అడుగుకూడా అవతలికి వెయలేదు అవి.

"మన పని అయిపోక తప్పదని వాటికి తెలిసినట్టు నాకు అనిపిస్తోంది. అయిపోయిన వెంటనే వచ్చి మీద పడటానికి రెడీగా వున్నాయి." మేకపిల్లకు చెపుతూ, నెమ్మదిగా లేచి నిలుచున్నాడు అతను.

తనను వదిలిపెట్టి వెళ్ళిపోతాడేమోనన్న భయంతో, గిలగిలా కొట్టుకోవటం మొదలుపెట్టిన ఆ చిన్న ప్రాణాన్ని గట్టిగా పట్టుకుని భుజాలమీద పెట్టుకున్నాడు.

తన బరువునే తను మోసుకోలేక పోతున్న ఆ నీరస స్థితిలో, ఆ మేకపిల్లను భుజాల మీదికి ఎక్కించుకోవటం చాలా పెద్ద తప్పని తెలుస్తూనే వున్నా లెక్కచేయ కుండా... మరోసారి ముందుకు నడవటం మొదలు పెట్టాడు.

రెండు అడుగులు వేసిన తర్వాత అడుగు పెట్టింది ఆ అనుమానం అతని మనస్సులో.

నరమానవుడు ఎవరూ కనిపించడని అనుకుంటున్న ఆ ప్రదేశంలోకి అంత వయసు తక్కువ జీవం ఎలా వచ్చింది?

అడుగులు వేయటాన్ని ఆపి, నుదుటిమీది నించి కళ్ళలోకి జారుతున్న చెమట బిందువుల్ని తుడుచుకుంటూ చుట్టూ చూశాడు...

మనసులో మెదిలిన సందేహానికి సమాధానం లభించలేదు గాని, అల్లంతదూరంలో వున్న ఒక ఇసుకదిబ్బ పక్కన వున్న పెద్ద కొండ రాయి అతని దృష్టిని ఆకర్షించింది.

నీడ... ఒక మనిషి సుఖంగా కూర్చోవటానికి అవసరమైన నీడను ఇచ్చేంత పెద్దదిగా వున్నది అది.

వేగంగా నడవటానికి ఎంత మాత్రము సహకరించని పాదాల్ని అతి బలవంతంగా కదిలిస్తూ ఆ బండదగ్గరకి పోయాడు అతను. భుజాలమీది బరువును క్రిందికి దించబోయి, అదిరిపడి వెనక్కి దూకాడు.

ఎండ వేడిమిని తట్టుకోవటం కోసం, ఆ బండ చాటుకు వచ్చి వున్నాయి అరచేయి వెడల్పుగా వున్న రెండు ఎడారి తేళ్ళు, తమ ఏకాంతానికి అడ్డు రాబోయిన మనిషిని చూసి కొండేల్ని పైకి ఎత్తాయి.

అవి కుట్టటం అంటూ జరిగితే ఆ తర్వాత ఏం జరుగుతుందో చాలా బాగా తెలుసు శ్యామ్‌సుందర్‌కి.

వేగంగా వెనక్కి దూకటం వల్ల తలమీది గాయం తిరిగి తన సలపరింతను రీస్టార్ట్ చేస్తున్నా లెక్క చెయ్యకుండా తన ఎడమకాలి బూటును ఊడతీశాడు.

"ఒక్కక్షణం బేబీ... ఒకే ఒక్కక్షణం" అని మేకపిల్లకు చెపుతూ బూటుతో ఆ తేళ్ళను దబదబా బాదేశాడు. ప్రాణంలేని వాటి శరీరాల్ని అవతలికి విసిరి, మేక పిల్లతో సహా, ఆ బండరాయి నీడలో చతికిల పడ్డాడు.

అక్కడితో పూర్తిగా అంతం అయిపోయింది అతని ఓపిక. తనకు తెలియకుండానే ఇంకోసారి స్పృహను కోల్పోయి క్రిందికి వాలిపోయాడు.

*   *   *   *   *

"ఎవరివి భాయీ? ఎక్కడినించి వచ్చావ్? ఎవరు కావాలి నీకు?" ఒక్కక్షణం కూడా గాప్ ఇవ్వకుండా, తన బడ్డీకొట్టు దగ్గర నిలబడి వున్న మనిషిని అడిగాడు కాలేషావలీ.

సరిగ్గా ఒక గంట క్రితం అక్కడికి వచ్చాడు ఆ మనిషి. వచ్చిన క్షణం నుంచీ బడ్డీకి ఆపోజిట్‌గా రోడ్డుకు అవతలి పక్కన వున్న బిల్డింగ్ వైపే చూస్తూ నిలుచున్నాడు.

నేషనల్ హైవేస్ మీద ట్రాఫిక్‌ని నిముషానికి ఇన్ని వెహికల్స్ అని ఎలా లెక్కిస్తారో, కాలేషావలీ బడ్డీ దగ్గరికి వచ్చే కస్టమర్స్‌ని కూడా అదే మాదిరి లెక్కబెడుతూ వుంటారు.

జర్దాపాన్‌లను కట్టడంలో మెలితిరిగిన చెయ్యి కాలేషావలీది. అతను గనుక మనసుపెట్టి పాన్ కట్టటం అంటూ జరిగితే, ఆ తరువాత ఇంకో చోటికి వెళ్ళలేరు కస్టమర్లు... కాపుసారా తాగటానికి అలవాటుపడిన డ్రింకర్స్, సారా కొట్టును వెతుక్కుంటూ వెళ్ళినట్టు తిరిగి తిరిగి అతని బడ్డీ దగ్గరికే వచ్చి తీరుతారు.

పొగాకుతో కూడిన పదార్థాలను గవర్నమెంట్ నిషేధించటం వల్ల కొద్దిగా స్లాక్ పిరియడ్‌లోకి ఎంటర్ అయింది అతని బిజినెస్. అయినా సరే ముగ్గురు నిలబడి వుంటారు ఎప్పుడు చూసినా.

అందరూ వింటూవుండగా పాన్ కట్టమని అడగటానికి సిగ్గుపడో, లేక భయపడో దూరంగా నిలుచున్నాడని ఆ మనిషిని గురించి అనుకున్నాడు కాలేషావలీ మొదట్లో. గంట గడిచినా అతను తన దగ్గరికి రాకపోవటం, రోడ్డుకు అవతలి పక్కన వున్న బిల్డింగ్‌ని అదే పనిగా చూస్తూ వుండటంతో, ఉండబట్టలేక మాట్లాడించాడు అతన్ని.

"అబ్బే.. ఏమీలేదు భాయీ... బిల్డింగ్ చూడటానికి బాగుంది. పెయింట్ కూడా చాలా ఖరీదయినది వేయించారు. అందుకే చూస్తున్నా" మొదట్లో కొంచెం తడబడినా, వెంటనే తమాయించుకుంటూ చెప్పాడు ఆ మనిషి.

"నేను అడిగిందేమిటి? నువ్వు చెపుతోంది ఏమిటి? ఆ బిల్డింగ్ గురించి నిన్ను ఎవరు అడిగారు?" కనుబొమల మధ్యలో నుంచి చూస్తూ రఫ్‌గా అడిగాడు కాలేషావలీ.

"ఎవరూ అడగలేదు భాయీ... నేను చెపుతున్నా... రోడ్డు మీద నడిచే వాళ్ళు ఎవరూ దాని వంక చూడకూడదా?" ఉన్నట్లుండి కొంచెం ఎగ్రెసివ్‌గా అడిగాడు ఆ మనిషి.

అవసరం అయితే అతనికంటే వందింతలు ఎగ్రెసివ్‌గా మాట్లాడ గలడు కాలేషావలీ. వట్టిగా మాట్లాడటమే కాదు. బడ్డీలో నుంచి ఒక గంతులో బయటికి వచ్చి తన పిడికెళ్ళకు పని కూడా కల్పించ గలడు.

"నీకు కొంచెం కోపం ఎక్కువ భాయీ... వ్యాపారం చేసుకునే వాడికి అది మంచిది కాదు... శాంతం అలవాటు చేసుకో..." అంటూ తన శ్రేయోభిలాషులు కొందరు అదేపనిగా హెచ్చరించటంతో ఈ మధ్యనే అతి బలవంతంగా ఆ అలవాటు తప్పించుకున్నాడు.

ఇప్పుడు ఈ మనిషి మాట్లాడిన పద్ధతిని గమనించిన మరుక్షణం తాచుపాములా తల ఎత్తింది ఆ పాత అలవాటు.

అయినా సరే తమాయించుకున్నాడు.

"చూడు భాయీ... ఆ బిల్డింగ్ మామూలు బిల్డింగ్ కాదు. సెక్యూరిటీ కన్సల్‌టెంట్ వాత్సవసాబ్‌ది. వాత్సవ సాబ్ అంటే తెలుసు గదా.... కేడీలకు కేడీ... మర్యాదస్తులకి మహామర్యాదస్తుడు..." బహుమెత్తగా చెప్పాడు.

"ఆయన ఒక్కడే వుంటాడా? ఆయన పార్టనర్ ఇంకొకతను–" అంటూ మాటని ఆపాడు ఆ మనిషి.

ఉబ్బిపోయింది కాలేషావలీ గుండె... కారణం ఏమిటో అతనికి కూడా తెలియదు... "మాశ్యామ్‌సుందర్ సాబ్... నువ్వు అడగదల్చుకున్నది శ్యామ్ సాబ్‌ని గురించే కదా?" ఉత్సాహంగా అన్నాడు.

తల ఊపాడు ఆ మనిషి "చాలా దూరం నించి వచ్చాను భాయి... మాది నాగపూరు... ఇక్కడ ఒక షాదీని చూడటానికి... శ్యామ్ సుందర్‌సాబ్‌ని గురించి నాగపూర్లో చాలా గొప్పగా చెప్పుకుంటారు... ఒక్కసారి చూడటానికి వీలు పడుతుందా?" అని అడిగాడు.

ఇంకా ఉబ్బిపోయింది కాలేషావలీ గుండె. శ్యామ్‌సుందర్‌ని గురించి ఎవరు మాట్లాడినా, అలాగే జరుగుతుంది ఎప్పుడూ.

"అరెరే... బాడ్ లక్కు భాయీ. శ్యామ్‌సాబ్ నిన్ననే ఏదో పనిమీద ఢిల్లీ వెళ్లాడు... రావటానికి ఇంకో నాలుగైదు రోజులు పడుతుందని వాసంతి మేడమ్ చెప్పింది" అన్నాడు.

"వాసంతి మేడమ్ ఎవరు?" అడిగాడు ఆ మనిషి

"అరె భాయీ... శ్యామ్‌సుందర్ సాబ్‌ని గురించి తెలిసిన తర్వాత వాసంతి మేడమ్ గురించి తెలియకపోవడం ఏమిటి?" ఆశ్చర్యంగా అడిగాడు కాలేషావలీ.

"తెలియదని తప్పుకున్నాను కదూ... నీకు తెలిసింది చెప్పవచ్చును కదా" గోముగా అడుగుతున్నట్టు ముఖం పెడుతూ అడిగాడు ఆ మనిషి.

"నీకు ఏ పాన్ కావాలి?" వెంటనే ప్రశ్నించాడు కాలేషావలీ.

"రాంపురి పట్టా వున్నదా?" అడిగాడా మనిషి.

"అది మన స్పెషాలిటీ భాయీ. పాన్ అంటూ తింటే దాన్నే తినాలి... తిన్నవాడే మొనగాడు." అంటూ బడ్డీలో ఒక పక్కగా పెట్టి వుంచిన దినుసుల్ని తీసి అర్జంటుగా ఆ పాన్‌ని తయారుచేశాడు కాలేషావలీ.

"శ్యామ్‌సుందర్ సాబ్‌తో కలిసి వాత్సవసాబ్ ఈ సెక్యూరిటీ కన్సల్ టెంట్‌ని మొదలుపెట్టారు. సెక్యూరిటీకి సంబంధించి ఎటువంటి సమస్య వచ్చినా చిటికెలో తేల్చిపారేస్తారు. పోలీసులకి కూడా సమఝువని ఎన్నెన్నో కేసుల్ని చిటికెలో హుష్ అనిపించేశారు. వాత్సవ సాబ్ మహా తెలివైన వాడూ... మా శ్యామ్‌సాబ్ అయితే చెప్పాల్సిన అవసరమే లేదు. నాగపూర్లో వున్నానని నువ్వే చెప్పావ్ కదా..." పాన్‌ని అతనికి అందిస్తూ చెప్పాడు.

"శ్యామ్‌సుందర్‌తో పాటు వాత్సవ సాబ్ కూడా ఢిల్లీ వెళ్ళారా?" పాన్‌ని బుగ్గన పెట్టుకుంటూ అడిగాడు ఆ మనిషి.

"నువ్వు నేను చెప్పేది పూర్తిగా వినకుండా మధ్యలో వేరే ప్రశ్న వేస్తున్నావు... వాసంతి మేడమ్ గురించి చెప్పాలి కదా..." అన్నాడు కాలేషావలీ.

"చెప్పు భాయీ... మరిచే పోయాను... చెప్పు" అన్నాడు అతను.

"వాసంతి మేడమ్ అంటే వాత్సవ సాబ్ ఆఫీసులో మేనేజర్, బల్ చలాక్... అవసరం అయితే చెమడాల్ ఎక్కదీస్తేసది... ఖతర్నాక్..." భక్తిగా చెప్పాడు కాలేషావలీ...

బుద్ధిగా తల ఊపాడు ఆ మనిషి.

"ఇప్పుడు చెప్పు భాయీ... వాత్సవసాబ్..." అంటూ వుండగా, తనే చెప్పాడు కాలేషావలీ "శ్యామ్‌సాబ్‌తోపాటు ఢిల్లీ వెళ్ళలేదు. ఇంట్లోనే వున్నాడు... కావాలంటే చెప్పు... తీసుకుపోయి మాట్లాడిస్తారు" అంటూ.

**End of Preview.**

**Rest of the book can be read @**

**http://kinige.com/book/Nissabdanadam**

* * *